అందరికీ రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష



భీమ్‌నగర్ శిబిరం వద్ద వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు



భీమ్‌నగర్ పీహెచ్‌సీలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రజారోగ్య రక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అన్ని ప్రాంతాల్లోనూ మంచి స్పందన లభిస్తోంది. పేదలు ఈ శిబిరాలకు హాజరై వైద్య సేవలు పొందుతున్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు రోగులకు సేవలందిస్తున్నారు.

- ఉడ్‌యార్డ్ సచివాలయం పరిధి ప్రజలకు వైద్య సేవలు
- శిబిరానికి హాజరైన ప్రత్యేక వైద్య నిపుణులు

అల్లిపురం : ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 33వ వార్డు ఉడ్‌యార్డ్ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఎంపికయిన వారికి భీమ్‌నగర్, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో గల లబ్ధిదారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు పంపించారు. వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్, ఆప్త మాలజీ, గైనకాలజీ వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. టీబీపై ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

పోషకాహారంపై అవగాహన..

గర్భిణులు,, బాలింతలు, మహిళలకు అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలు, రాగిపిండి, పాల ఉత్పత్తుల ప్రయోజనాలను వివరించారు. ప్రతి రోజు ఒక గుడ్డు తీసుకోవాలని, మునగాకు, తోటకూర, బచ్చలికూర వంటి ఆకుకూరలు తరచూ తీసుకోవడం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, సీలాపు అయ్యప్పరెడ్డి, సచివాలయం పరిధిలో గల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయం, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టకండి



సీఐలు రమణమూర్తి, సూరినాయుడు, ఎస్‌ఐ ప్రతాప్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ఎమ్మెల్యే వాసుపల్లితో వన్‌టౌన్ సీఐ భాస్కరరావు

అల్లిపురం : టూటౌన్, మహారాణిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆయా స్టేషన్ల శాంతి భద్రతలు, ట్రాఫిక్ సీఐలను ఆదేశించారు. మహారాణిపేట సీఐ బండారు రమణమూర్తి, టూటౌన్ ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, సబ్ ఇన్స్‌పెక్టర్ ప్రతాప్ గురువారం రాత్రి ఎమ్మెల్యే వాసుపల్లిని అతని ఆశీలమెట్ట క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా మంది పేదవారున్నారు. వారంతా రోడ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారన్న నెపంతో వారిని వ్యాపారాలు చేసుకోనీయకుండా ఇంబ్బందులకు గురి చేస్తున్నారని, దీని వలన వారు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వారి పట్ల ఉదారతతో వ్యవహరించాలని, వారిని ఇబ్బంది పెట్టకుండా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన వన్‌టౌన్ సీఐ..

వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన బి.భాస్కరరావు గురువారం రాత్రి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని, ఎటువంటి వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

- టూటౌన్ క్రైం ఎస్‌ఐ శ్రీనివాస్



అపార్టుమెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ క్రైం ఎస్‌ఐ శ్రీనివాసరావు

అల్లిపురం : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని టూటౌన్ క్రైం ఎస్.ఐ కె. శ్రీనివాస్ అన్నారు. దొంగతనాలు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అస్సాం గార్డెన్స్, నీలమ్మ వేపచెట్టు దరి హరినాథ్ అపార్టుమెంట్, పద్మావతి అపార్ట్‌మెంట్, రవికృష్ణ అపార్ట్‌మెంట్ల నివాసితులకు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి అపార్టుమెంట్‌లోను నలుదిక్కుల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపరిచితులను అపార్ట్‌మెంట్లలోకి అనుమతించరాదన్నారు. అనుమానం కలిగిన వారిని గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. వీలైనంత వరకు విలువైన వస్తువులు, పత్రాలను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. వీలు లేనివారు వాటిని జాగ్రత్తంగా భద్రపరచుకోవాలన్నారు. ప్రయాణాల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పొరుగు ఫ్లాట్ల వారికి సమాచారం అందజేయాలన్నారు. అదే విధంగా పోలీస్ స్టేషన్‌లో తెలియజేసినట్లయితే ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టంను ఉచితంగా ఏర్పాటు చేస్తారన్నారు. వారు ఊరి నుంచి తిరిగి వచ్చేంత వరకు ఆ ఇంటిపై నిఘా ఉంచుతారన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అర్జున్, కానిస్టేబుల్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పండా వీధిలో భారీ అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి

జగదాంబ : దసరా ఉత్సవాలను పురస్కరించుకుని 35వ వార్డులోని పండావీధిలో శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి హాజరై అన్నదానం చేశారు. ఏటా ఇక్కడి చినదుర్గాలమ్మ ఆలయం వద్ద చిట్టిబోయిన విజయ్ మిత్ర బృందం ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏటా ఇదే విధంగా అన్నదానంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కనకరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



రామన్నపాత్రుడు

డాబాగార్డెన్స్ : సామాజిక సాధికారిక కులగణన చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలపడం రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని రాష్ట్ర అయ్యారక వెల్ఫేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కంట్రెడ్డి రామన్నపాత్రుడు తెలిపారు. దశాబ్దాలుగా ఎందరో నాయకులు, సామాజిక సంఘాలు చేస్తున్న పోరాటాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నందుకు కంట్రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్ కళాశాలల కబడ్డీ విజేత రఘు కళాశాల



విజేత జట్టు రఘు ఇంజనీరింగ్ కళాశాల

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జేఎన్‌టీయూ గురజాడ, విజయనగరం పరిధిలోని కళాశాలల కబడ్డీ పోటీల్లో రఘు ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి 15 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో రఘు ఇంజినీరింగ్ కళాశాల, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలల జట్లు హోరా హోరీగా తలపడ్డాయి. ముగింపు కార్యక్రమంలో దువ్వాడ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విజేత జట్టు అంతర్ రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నాయని తెలిపారు. సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష ఆదరణ



జామియా మసీదు ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజాదర్బార్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, వాసుపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

36వ వార్డులో..

ముస్లింల సమస్యల పరిష్కారానికి ఏవీఎన్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులతో మాట్లాడారు. 35వ వార్డు పరిధిలో డాన్‌బాస్కో స్వచ్ఛంద సంస్థలో శిక్షణ తీసుకున్న వారికి కుట్టు మిషన్లు అందజేయాలని కోరటంతో పోర్టు చైర్మన్‌తో మాట్లాడి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, వార్డు అధ్యక్షుడు, నగర కార్యదర్శి ఆదివిష్ణు, సౌత్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, ఆళ్ల శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, దశమంతుల చిన్ని, ముస్లిం నాయకులు రఫీ, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ఏపీడబ్ల్యూజేఎఫ్ హర్షం

డాబాగార్డెన్స్ : అక్రిడేటెడ్ జర్నలిస్టులకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్లు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. గత కొన్నేళ్లుగా స్థలాల కోసం ఎదురు చూస్తున్న జర్నలిస్టులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారని, ఇది శుభపరిణామమని తెలిపారు.

క్లస్టర్-3 జేసీఎస్ ఇన్‌చార్జిగా సనపల



సనపల రవీంద్రభరత్

డాబాగార్డెన్స్ : క్లస్టర్-3 (దక్షిణ నియోజకవర్గం 36, 38, 39 వార్డులకు) జేసీఎస్ ఇన్‌చార్జిగా సనపల రవీంద్ర భరత్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు మరింత కష్టపడి పని చేస్తానని సనపల హామీ ఇచ్చారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలకు వీల్‌లాక్



రాంగ్ పార్కింగ్ వాహనానికి వీల్‌లాక్ చేసిన ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు

జగదాంబ : రాంగ్ పార్కింగ్ చేసే వాహనాలకు వీల్ లాక్ చేసి అపరాధ రుసుము విధిస్తున్నామని వన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ ఎన్‌వీ భాస్కరరావు తెలిపారు. శుక్రవారం పూర్ణామార్కెట్ దరి ఫ్రూట్‌మార్కెట్ వద్ద రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు వీల్‌లాక్ చేసి ఆయన మాట్లాడారు. కమిషనర్ ఆదేశాల మేరకు రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు తక్షణమే వీల్ లాక్ చేస్తున్నామన్నారు. తర్వాత వాహన యాజమానులకు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. తమ సిబ్బందితో పూర్ణామార్కెట్ జంక్షన్‌లో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నామన్నారు. దీని ద్వారా ట్రాఫిక్‌లో అంతరాయం లేకుండా ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో పలు విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నారు. పలు మెడికల్ ఆఫీసర్ పోస్టులు కాంట్రాక్ట్, మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు http@// visakhapatnam. nic. in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత నకలు కాపీని ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో చూడాలని డీఎంహెచ్‌వో తెలిపారు.

జాబ్‌మేళాలో 81 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. సుమారు 8 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 305 ఉద్యోగ ఖాళీల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 186 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 81 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాల కల్పనకు ఎంతో కృషి చేస్తోందని ఆయన అన్నారు. నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రాస్ బౌ షూటింగ్‌లో విశాఖ షూటర్ల సత్తా



స్వర్ణ పతకం సాధించిన లోకేజిత్

కొమ్మాది/డాబాగార్డెన్స్: ఆగ్రాలో గత నెల 26 నుంచి 31వ తేదీ వరకు జరిగిన 10వ అంతర్జాతీయ క్రాస్ బౌ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విశాఖ షూటర్లు సత్తా చాటారు. ఎండాడకు చెందిన వి.ఎస్ లోకేజిత్ జూనియర్ బాలుర ఓపెన్ ఫ్రీస్టైల్ కేటగిరీలో స్వర్ణ పతకం, నగరానికి చెందిన పేపకాయల సాయి కౌశిక్ రెండు వెండి పతకాలు సాధించాడు. అత్యంత చిన్న వయసులోనే లోకేజిత్ అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకంపై అతని తల్లిదండ్రులు రవి కుమార్,సహజ హర్షం వ్యక్తం చేశారు. కాగా.. ఆస్ట్రేలియా, , స్వీడన్, ఫిన్లాండ్, యూఎస్ఏ, యూకే, పోర్చుగల్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 65 మంది ఈ పోటీల్లో పద్దారు.

ఎన్టీపీసీ సింహాద్రిలో వెండర్ మీట్ ఏర్పాటు



సింహాద్రి ఎన్టీపీసీ వెండర్ మీట్‌లో పాల్గొన్న ప్రతినిధులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో శకుంతలం ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2023లో భాగంగా శుక్రవారం వెండర్ మీట్‌ను నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంస్థ నుంచి 50 మంది విక్రేత ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (వెస్ట్-2) సి.శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మీట్ వెండర్ల సమస్యలను అంచన వేశారు. వివిధ పీఎస్‌యూల్లో సాంకేతికతను ఉపయోగించడంలో ఎన్టీపీసీ ముందంజలో ఉన్నందుకు సింహాద్రి ఎన్టీపీసీ ప్రతినిధులను అభినందించారు. ఈ సమావేశంలో యూఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కుందు, చీఫ్ జనరల్ మేనేజర్ యు.హెచ్.గోఖే పాల్గొన్నారు. సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, వీపీజీ చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామారావు, డీజీఎంలు, ఉద్యోగులు హాజరయ్యారు.


ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన నౌసైనిక్ క్యాడెట్లు ఎండీ ముబీన్, ఎ.విజయ్‌కుమార్, వాయు సైనిక్ క్యాడెట్లు పవన్ కార్తికేయ, రామ్ నారాయణలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ అభినందించారు. ముంబయిలోని లోనావాలలో జరిగిన అఖిల భారత నౌసైనిక్ శిబిరంలో ముబీన్, విజయ్, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ జలహల్లి, బెంగళూరులో జరిగిన అఖిల భారత వాయు సైనిక్ శిబిరంలో పవన్, రామ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ జి.ఎ స్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వి.హెచ్.శ్రీకాంత్, మేజర్ బ్రహ్మానందరెడ్డి, ఫ్లయింగ్ అధికారి బి.ఆర్.ఎ స్.లక్ష్మణరెడ్డి తదితరులు అభినందించారు.

ఖైదీ రాజాచంద్ర మృతిపై 7న విచారణ

తగరపువలస: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా బండ్లగూడకు చెందిన ఖైదీ యడ్ల రాజాచంద్ర (41) ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ ఏడాది మార్చి 9న మృతి చెందినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. దీంతో రాజాచంద్ర మృతిపై భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిని విచారణ అధికారిగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నియమించారు. ఈ నెల 7న భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి తన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విచారణ నిర్వహించనున్నారు. రాజాచంద్ర మృతిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే విచారణకు హాజరై మౌఖికంగా లేదా లిఖితపూర్వకంగా తెలియచేయాలని భాస్కరరెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

9 నుంచి శాంతి సద్భావన పాదయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), వంద విదేశీ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో వందే విశ్వమాతరం పేరిట 100 దేశాల్లో శాంతి సద్భావన యాత్రకు శ్రీకారం చుట్టారని సాహితీ విమర్శకుడు డి.వి.సూర్యారావు అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం స్థానిక పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తానా సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ సారథ్యంలో ఈ నెల 9న శాంతి సద్భావన యాత్ర ప్రారంభమవుతుందన్నారు. 2023-25 మధ్యకాలంలో రెండేళ్ల పాటు 100 దేశాల్లో 130కి పైగా సభలు జరుగుతాయని వెల్లడించారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం, మానవీయ విలువలు పెంపొందింపజేయడం, ప్రకృతి రక్షణ, పర్యావరణ పరిరక్షణ, విశ్వశాంతి, సౌభ్రాతృత్వం తదితర లక్ష్యాలతో ఈ యాత్ర సాగుతుందన్నారు. పిళ్లా వెంకటరమణమూర్తి, శేఖరమంత్రి ప్రభాకర్, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

5న ఆర్యవైశ్య యువజన సంఘం గోల్డెన్ జూబ్లీ



సమావేశంలో మాట్లాడుతున్న నూకరాజు

డాబాగార్డెన్స్ : ఈ నెల 5న ఆర్యవైశ్య యువజన సంఘం గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెనుగొండ వెంకట్రావు, తాటికొండ గవరరాజు, పబ్బిశెట్టి వరహాలు శెట్టి, కందుల రామారావుతో పాటు పలువురు ఆర్యవైశ్యులు కలిసి పేద ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలు అందించాలన్న ఉద్దేశంతో 1973లో సంఘం స్థాపించబడిందన్నారు. అప్పటి నుంచి పేద ఆర్యవైశ్యులకు సేవలందిస్తూ వస్తున్నామని, మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టు మిషన్లు, అల్లికలు వంటివి నేర్పించామని తెలిపారు. అంతే కాకుండా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘం 50వ వార్షికోత్సవం ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో గ్రంధి దుర్గాప్రసాద్, కేవీ రమణ, బాబూరావు పాల్గొన్నారు.

ర్యాగింగ్ దుష్పరిణామాలపై అవగాహన



ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ర్యాగింగ్ దుష్పరిణామాలు, పర్యవసానాలు, చట్టాలపై అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగింది. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు నేతృత్వంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ప్రత్యేక పోస్టర్లను ప్రదర్శించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పించారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆకస్మిక తనిఖీ

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను స్టేట్ అటల్ టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. బృందంలో అధికారులు ఎస్.వి.రమణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ కె.ప్రసాద్, సీహెచ్ గిరిప్రసాద్ పలు అంశాలు పరిశీలించి, ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. ల్యాబ్ పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మారథాన్, ఇన్నోవేషన్‌లో పాల్గొన్న విద్యార్థినులు, వారి ప్రాజెక్టుల గురించి ఆరా తీశారు. హెల్త్ కోటులో భాగంగా ప్రాజెక్టు నిర్వహించిన 10వ తరగతికి చెందిన సౌజన్యతో మాట్లాడి, ప్రాజెక్టు గురించి తెలుసుకున్నారు. విద్యార్థినుల అవార్డులను, సర్టిఫికెట్లను, ల్యాబ్ రికార్డు నగదు లావాదేవీలను తనిఖీ చేశారు. వర్కుషాపులు, బూట్ క్యాంపులు, రికార్డులు పరిశీలించారు. ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా క్లాసులు నిర్వహిస్తూ వాటిని రికార్డు చేయాలని తెలిపారు. ప్రిన్సిపాల్ టి.నాగమణి, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీకాంతి, సైన్స్ టీచర్లను అభినందించారు.

క్రీడాకారులకు గెలుపు లక్ష్యం కావాలి

మధురవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ద్రోణంరాజు కల్యాణ మండపంలో శుక్రవారం తైక్వాండో జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, విజయమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని 67వ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల జట్ల ఎంపికలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. విశాఖ జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలరాజు పర్యవేక్షణలో ఈ ఎంపికలు జరిగాయి.